సాక్షి అనకాపల్లి

గురువారం । 21 । ఆగస్టు । 2025



ఇన్నోవేషన్ హబ్ ప్రారంభం

మహారాణిపేట: విశాఖలో రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ప్రారంభమైంది. మంగళగిరి నుంచి సీఎం వర్చువల్‌గా శ్రీకారం చుట్టారు.



ఎట్టకేలకు డిగ్రీ అడ్మిషన్లు 8లో



పోర్టునులో రష్యా బృందం

విశాఖ: విద్యారంగం, ప్రైవేట్ పరిశ్రమల ప్రతినిధులతో కూడిన 14 మంది రష్యన్ బృందం విశాఖ పోర్ట్‌ను బుధవారం సందర్శించింది.

న్యూస్‌రీల్

22న అతిథి అధ్యాపకులకు ఇంటర్వ్యూలు

యలమంచిలి రూరల్: జిల్లాలో ఖాళీగా ఉన్న మూడు అతిథి అధ్యాపకుల పోస్టులకు ఈ నెల 22వ తేదీన అనకాపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి మద్దిలి వినోద్‌బాబు తెలిపారు. చోడవరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మేథమేటిక్స్, వడ్డాది ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వొకేషనల్ కోర్సుకు ఈఈటీ, వడ్డాది ప్రభుత్వ కళాశాలలో ఎంపీహెచ్‌డబ్ల్యూ కోర్సుకు అతిథి అధ్యాపకులు అవసరమన్నారు. మేథమేటిక్స్ బోధనకు సంబంధిత సబ్జెక్టులో ఎమ్మెస్సీలో కనీసం 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించాలన్నారు. విశ్రాంత అధ్యాపకులు, ఇప్పటికే పనిచేస్తున్న అధ్యాపకులు, పాఠశాలల్లో పనిచేసి పదవీ విరమణ పొందిన స్కూల్ అసిస్టెంట్లు ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులన్నారు. ఈ నెల 21లోగా దరఖాస్తు చేయాలన్నారు.

కల్తీ ఎరువులు విక్రయిస్తున్న దుకాణం సీజ్



ఎరువుల దుకాణం వద్ద హడావుడి

చోడవరం: కల్తీ చేసి రైతులను దోపిడీ చేస్తున్న ఎరువుల దుకాణాన్ని విజిలెన్స్ అధికారులు సీజ్ చేశారు. గవరవరం రోడ్డులో ఉన్న శ్రీ లక్ష్మీదేవి ఫెర్టిలైజర్స్, పెస్టిసైడ్స్ ఎరువుల దుకాణంపై విజిలెన్స్ డీఎస్పీ మురళీకృష్ణ నేతృత్వంలో అధికారుల బృందం బుధవారం దాడి చేసింది. గొడౌన్లలో నిల్వ ఉంచిన ఎరువులను విజిలెన్స్ అధికారులు తనిఖీ చేశారు. ఎరువులను కల్తీ చేసి ఒకొక్క బస్తా దగ్గర రూ.300 అదనంగా వసూలు చేసి రైతులను దోపిడీ చేస్తున్నట్టు గుర్తించారు. డీఏపీ ఎరువులో మరో నాసిరకం ఎరువులను కలిపి డీఏపీ ధరకు విక్రయిస్తున్నట్టు తనిఖీల్లో వెల్లడైంది. మూడు రకాల నాసిరకం ఎరువులను కల్తీ చేసి అదనపు ధరలకు అమ్ముతున్నట్టు గుర్తించారు. దీనిపై సదురు ఎరువుల దుకాణంపై విజిలెన్స్ అధికారులు కేసు నమోదు చేశారు.

నీరు 'పల్ల'మెరుగు.. నిజం దేవుడెరుగు.. అన్నది పెద్దల మాట. కొన్ని నెలల క్రితం అచ్యుతాపురం కేంద్రంగా బయటపడిన అంతర్జాతీయ సైబర్ క్రైంలో ఆరోపణలున్న ఓ పోలీస్ అధికారిని తప్పించేందుకు విశాఖకు చెందిన టీడీపీ సీనియర్ ఎమ్మెల్యే జోక్యం తీవ్ర ఆరోపణలకు తావిస్తోంది. ఈ వ్యవహారంలో సీఐడీ దర్యాప్తుతో ఇప్పటికే నిర్వాహకులపై కేసులు నమోదయ్యాయి. సీఐడీ విచారణ మరింత లోతుకు వెళ్లకుండా సదరు పోలీస్ అధికారికి ఆ సీనియర్ ఎమ్మెల్యే 'పల్ల'కీ మోస్తున్నట్లు తెలుస్తోంది. దీనిపై కూటమి నేతల్లోనే తీవ్ర ఆక్షేపణలున్నాయి.

సైబర్ క్రైం దోషికి పల్లకీ మోత!



అచ్యుతాపురం సమీపంలోని భోగాపురం గ్రామంలో ఉన్న ఈ అపార్ట్‌మెంట్‌లోనే అంతర్జాతీయ స్థాయి సైబర్ క్రైం జరిగేది.. ఈ ఏడాది మే 20వ తేదీన దాడులు జరపడానికి వెళ్లిన పోలీసు వాహనాలను చిత్రంలో చూడవచ్చు.

అచ్యుతాపురం సైబర్ సెంటర్ దర్యాప్తులో పోలీస్ అధికారి పాత్రపై సీఐడీ అనుమానం

- ఆ అధికారి పేరు చేర్చకుండా టీడీపీ సీనియర్ ఎమ్మెల్యే జోక్యం?
- నెలవారీ మామూళ్లతో పాటు భారీ వసూళ్లపై ప్రాథమిక ఆధారాలు
- మరింత లోతైన దర్యాప్తు జరగనీయకుండా అడ్డంకులు

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం:

అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం కేంద్రంగా బీపీవో పేరిట అంతర్జాతీయ సైబర్ క్రైం వ్యవహారం వెలుగు చూసిన విషయం తెలిసిందే. ఈ నేరం బయటకు రావడానికి చాన్నాళ్ల ముందే 'వినాయకుడి'లాంటి ఓ పోలీస్ అధికారి వీరి దందాను గమనించి, దండిగా పిండుకున్నాడు. సీఐడీ విచారణలో ఈ పోలీస్ అధికారి ముడుపులపై ప్రాథమిక ఆధారాలు కూడా లభించినట్లు తెలిసింది. అయితే దర్యాప్తు మరింత లోతుల్లోకి వెళ్లకుండా టీడీపీ సీనియర్ ఎమ్మెల్యే అడ్డుపడటంపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

పసిగట్టి.. రూ.కోట్లు పట్టి!

అచ్యుతాపురంలో వంటి ప్రాంతంలో కాల్ సెంటర్(బీపీవో) ఏర్పాటుపై అంతా ఆహా ఓహో అనుకున్నారు. సదరు పోలీస్ అధికారి మాత్రం ఇలాంటి ప్రాంతంలో బీపీవో ఎలా? అన్న అనుమానంతో ఆరా తీయడం మొదలెట్టారు. ఏదో అడ్డగోలు వ్యవహారం నడుస్తుందనే కోణంలో నిర్వాహకుల్ని బెదిరించి మరీ నెలవారీ ముడుపులు, అప్పుడప్పుడూ భారీ మొత్తాలు కలిపి రూ.కోట్లలో వసూలు చేసినట్టు తెలిసింది. సైబర్ క్రైం బాధితులు పైస్థాయిలో ఫిర్యాదు చేయడంతో జిల్లా ఎస్పీ ప్రత్యేక టీంతో విచారణ ప్రారంభించారు. అప్పటి వరకు ఇక్కడ జరుగుతున్న వ్యవహారం తెలిసినప్పటికీ ఆ సమాచారాన్ని ఉన్నతాధికారులకు చేరనీయకుండా సదరు పోలీస్ అధికారి చూసుకున్నారన్న ఆరోపణలున్నాయి. ఈ మేరకు ఆధారాలు కూడా సీఐడీ విచారణలో లభించినట్లు తెలుస్తోంది.

టీడీపీ ఎమ్మెల్యే జోక్యంతో..!

టీడీపీకి చెందిన సీనియర్ ఎమ్మెల్యే రంగంలోకి దిగడంతో సీఐడీకి చేతులు కట్టేసినట్టయింది. సదరు ఎమ్మెల్యే తన సామాజిక వర్గానికే చెందినవారు కావడంతో ఆ పోలీస్ అధికారి కులం కార్డు బయటకు తీశారు. దీంతో సదరు పోలీస్ అధికారి పేరు విచారణ నివేదికలో చేర్చకూడదంటూ సీనియర్ ఎమ్మెల్యే ఆదేశించారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. తన నియోజక వర్గం కానప్పటికీ, ఆ ఎమ్మెల్యే జోక్యం చేసుకోవడంపై కూటమి నేతలు గుర్రుగా ఉన్నారు. పైగా అంతర్జాతీయ స్థాయిలో రాష్ట్రం పరువు పోగొట్టిన సైబర్ క్రైం వ్యవహారంలో పాత్రధారిగా ఉన్న పోలీస్ అధికారిని ఎలా వెనుకేసుకొస్తారంటూ విమర్శలు గుప్పిస్తున్నారు. సదరు ఎమ్మెల్యే కేవలం కులం కార్డు మాత్రమే కాకుండా భారీగా ముడుపులు కూడా తీసుకున్నట్లు పోలీస్ వర్గాల్లో చర్చ నడుస్తోంది.



కాల్ సెంటర్ కథాకమామీషు!

ముంబైకి చెందిన ఓ మహిళ అచ్యుతాపురంలో అపార్ట్‌మెంట్లను అద్దెకు తీసుకుని బీపీవో పేరిట సైబర్ క్రైం సెంటర్‌ను ఏడాది కాలంగా నిర్వహిస్తోంది. ప్రధానంగా ఈశాన్య రాష్ట్రాలకు చెందిన అమ్మాయిలను ఇందులో ఉపయోగించుకున్నారు. పవన్ రెసిడెన్సీ వేదికగా సాగిన ఈ వ్యవహారంలో అవసరమైన స్టాఫ్‌ను హైదరాబాద్, గుజరాత్‌ల్లో రిక్రూట్ చేశారు. అమెరికన్లను వలవేసేందుకు ప్రత్యేకంగా అమెరికన్ యాక్సెంట్ ఇంగ్లిష్‌లో మాట్లాడేలా వీరికి తర్ఫీదు ఇప్పించారు. అమెరికా ఈ-కామర్స్ పేరుతో ఫోన్లు చేసి కూపన్లు వస్తాయంటూ ఎరవేసి డబ్బులు లాగేసేవారు. ఎవరైనా చెల్లించకపోతే తమదైన శైలిలో ఫేక్ వీడియోలతో భయపెట్టి రూ.50 కోట్ల వరకూ కొల్లగొట్టినట్టు తేలింది. ఇతర రాష్ట్రాలతో లింకులు ఉండటంతో పాటు లోతుగా విచారణ చేయాల్సిన కేసు కావడంతో సీఐడీ రంగంలోకి దిగింది. సీఐడీ విచారణలో ఓ పోలీస్ అధికారి సైబర్ క్రైం గురించి పక్కాగా తెలియనప్పటికీ.. ఏదో వ్యవహారం నడుస్తోందన్న సమాచారంతో భారీ వసూళ్లకు పాల్పడినట్టు తేలింది. అయినప్పటికీ సదరు పోలీసు అధికారిపై కేసు నమోదు చేయకుండా టీడీపీ ఎమ్మెల్యే జోక్యంతో వ్యవహారం సద్దుమణిగినట్టు సమాచారం.



నిందితులను అరెస్టు చేసి తీసుకెళుతున్న పోలీసులు (ఫైల్)

నర్సీపట్నంలో నిఘా కెమెరాలు పెంచండి

ఎస్పీ తుహిన్ సిన్హా



స్టేషన్‌లో రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పీ తుహిన్ సిన్హా

నర్సీపట్నం: ఏజెన్సీ ముఖద్వారమైన నర్సీపట్నంలో ప్రధాన కూడళ్లలో నిఘా కెమెరాల సంఖ్య పెంచాలని ఎస్పీ తుహిన్ సిన్హా సూచించారు. బుధవారం సాయంత్రం నర్సీపట్నం టౌన్ పోలీసు స్టేషన్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రౌడీషీటర్లపై మరింత నిఘా పెంచాలని సిబ్బందికి సూచించారు. నాన్ బెయిలబుల్ వారెంట్లపై ఉన్న ముద్దాయిలను పట్టుకోవడానికి ప్రత్యేక పోలీసు బృందాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. దొరికిన వారిని వెంటనే కోర్టులో ప్రవేశపెట్టి చట్టపరమైన చర్యలు తీసుకోమన్నారు. పోలీసు స్టేషన్లను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. నర్సీపట్నంలోని ట్రాఫిక్ సిగ్నల్ పాయింట్లను పరిశీలించారు. ప్రధాన కూడళ్లలో నిఘా కెమెరాల సంఖ్య పెంచాలన్నారు. ట్రాఫిక్ నియంత్రణకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. ట్రాఫిక్ సిగ్నల్ పాయింట్లు ఏర్పాటు చేయాలని టౌన్ సీఐ గోవిందరావుకు సూచించారు. పెండింగ్ కేసులు పరిష్కరించాలన్నారు. ఈ ఆకస్మిక తనిఖీల్లో నర్సీపట్నం డీఎస్పీ శ్రీనివాసరావు ఉన్నారు.

ఏయూ ఇంజినీరింగ్‌లో అడ్మిషన్లు

విశాఖ విద్య: ఆంధ్ర యూనివర్సిటీ క్యాంపస్ ఇంజినీరింగ్ కళాశాలలో ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేసేందుకు చివరి దశ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు అడ్మిషన్ల డైరెక్టర్ డీఏ నాయుడు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అర్హత ఉన్న విద్యార్థులు గురువారం నుంచి ఈ నెల 23వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకొని, తమ సర్టిఫికెట్లను అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. ఖాళీగా ఉన్న సీట్ల వివరాలను 23వ తేదీన వెల్లడిస్తారు. విద్యార్థులు 24 నుంచి 26వ తేదీ వరకు వెబ్ ఆప్షన్లు పెట్టుకోవచ్చు. సీట్లు పొందిన విద్యార్థుల వివరాలను 28వ తేదీన ప్రకటిస్తారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

స్కూల్ బస్సుకు తప్పిన ప్రమాదం

గొలుగొండ: జోగుంపేట జంక్షన్ వద్ద స్కూల్ బస్సుకు ప్రమాదం తప్పింది. నర్సీపట్నంలోని నలంద స్కూల్ బస్ బుధవారం ఉదయం 8 గంటలకు జోగుంపేట కాలనీకి వెళుతున్న సమయంలో జోగుంపేట జంక్షన్ వద్ద స్టీరింగ్ అదుపు తప్పింది. ఈ సమయంలో బస్‌లో 55 మంది వరకు విద్యార్థులు ఉన్నారు. జోగుంపేట మలుపు వద్ద ప్రమాదం జరగడంతో ఎటువంటి నష్టం జరగలేదు. అదే రోడ్డుపై స్టీరింగ్ అదుపు తప్పితే పెద్ద ముప్పే ఎదురయ్యేది. కృష్ణదేవిపేట-నర్సీపట్నంలో తిరిగే బస్సులు పాతవి కావడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని తల్లిదండ్రులు ఆవేదన చెందుతున్నారు. వీటిపై రవాణాశాఖ చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



జోగుంపేటలో స్టీరింగ్ కంట్రోల్ తప్పి ఆగిపోయిన స్కూల్ బస్

సంపద కేంద్రాల్లో సేంద్రియ ఎరువుల తయారీ

- వానపాములు విడుదల చేసిన జెడ్పీ సీఈవో
- అన్ని గ్రామాల్లో క్లోరినేషన్ చేయాలని ఆదేశం

నక్కపల్లి: గ్రామాల్లో నిర్మించిన సంపద తయారీ కేంద్రాల్లో చెత్త నుంచి సేంద్రియ ఎరువులు తయారు చేసే కార్యకలాపాలు చేపట్టాలని జిల్లా పరిషత్ ముఖ్యకార్యనిర్వాహణాధికారి నారాయణమూర్తి సూచించారు. బుధవారం ఆయన దేవవరం, ఒడ్డిమెట్ట, ఉద్దండపురం గ్రామాల్లో పర్యటించారు. ఐవీఆర్ఎస్ గ్రామాలుగా గుర్తించిన పంచాయతీల్లో శానిటేషన్‌పై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, ఎంపీడీవోలు, కార్యదర్శులు ప్రతిరోజు క్రమం తప్పకుండా ఉదయాన్నే పర్యటించి, ఇళ్ల నుంచి సేకరించిన చెత్తను సంపద తయారీ కేంద్రాలకు తరలించేలా చర్యలు తీసుకోవాలన్నారు. దేవవరం సంపద తయారీ కేంద్రంలో ఇళ్ల నుంచి సేకరించిన తడిపొడి చెత్తను వేరు చేసే ప్రక్రియను స్థానిక క్లాప్ మిత్రలు చేపట్టారు. ఇలా వేరు చేసిన చెత్త నుంచి వర్మికంపోస్టు (సేంద్రియ ఎరువులు) తయారు చేసేందుకు గాను వానపాములను విడుదల చేశారు. అనంతరం ఒడ్డిమెట్ట గ్రామంలో రక్షిత మంచినీటి పథకాన్ని పరిశీలించారు. తదుపరి ఉద్దండపురంలో రక్షిత మంచినీటి పథకాల్లో క్లోరినేషన్ పనులను పరిశీలించారు. రైతు సేవాకేంద్రాలను తనిఖీ చేసి ఖరీఫ్‌లో రైతులకు అవసరమైన ఎరువులు అందుబాటులో ఉన్నాయో లేవో ఆరా తీశారు. వెల్‌నెస్ సెంటర్లో సిబ్బంది పనితీరు, రోగులకు అందుతున్న సేవల గురించి తెలుసుకున్నారు. సచివాలయ సిబ్బంది సహకారంతో గ్రామాల్లో క్లోరినేషన్ చేయించాలన్నారు. ఒడ్డిమెట్ట గణపతి ఆలయాన్ని సీఈవో దర్శించుకున్నారు. ఎంపీడీవో సీతారామరాజు, డిప్యూటీ ఎంపీడీవో చలపతిరావు, సర్పంచ్‌లు జి.నర్సింహమూర్తి, పి.వెంకటేష్, ఉప సర్పంచ్ వేగేశ్న చంటి, కార్యదర్శి శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.



సంపద తయారీ కేంద్రంలో వానపాములు విడుదల చేస్తున్న సీఈవో నారాయణమూర్తి



"గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో డాక్టర్లను మేనేజ్ చేసుకొని, దొంగ సర్టిఫికెట్లు పెట్టుకొని, దివ్యాంగ పెన్షన్లు తీసుకున్నారు. వాటిని తొలగించాలని రాష్ట్ర ప్రభుత్వానికి నేనే లేఖ రాశాను. ఇప్పటికే రాష్ట్రంలో లక్షకు పైగా పెన్షన్లు తొలగించారు. ఇంకా వెరిఫికేషన్ కొనసాగుతోంది. ఒక్క అనకాపల్లి జిల్లాలోనే 4,148 మందిని అనర్హులుగా గుర్తించి, వారి డూప్లికేట్ దివ్యాంగ పెన్షన్లు తొలగించాం."

-ఇవి బుధవారం నర్సీపట్నం ప్రెస్‌మీట్‌లో స్పీకర్ అయ్యన్నపాత్రుడు చెప్పిన మాటలు



దీనికేమంటారు స్పీకర్ గారూ..

కాసేపు మీ మాటలనే ప్రామాణికంగా తీసుకుందాం.. ఇవన్నీ వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మేనేజ్ చేసి తీసుకున్న పింఛన్లే అనుకుందాం.. మరి గొలుగుండ మండలం విప్పలపాలేనికి చెందిన రుత్తల సూర్యవతి 16 ఏళ్ల నుంచి దివ్యాంగ పింఛన్ తీసుకుంటున్నారు. పుట్టుకతోనే మరుగుజ్జు, బుద్ధిమాంద్యంతో 50 శాతానికి పైగా వైకల్యంతో బాధపడుతున్నారు. ఆమె పెన్షన్ కూడా తొలగించారు.

గొలుగొండ మండలంలో గాదంపాలేనికి చెందిన వేములపూడి శాంతాకుమారికి 15 ఏళ్లుగా దివ్యాంగ పెన్షన్ వస్తోంది. 2010లో ఇచ్చిన కంప్యూటరైజ్డ్ దివ్యాంగ సర్టిఫికెట్‌తోపాటు యూఐడీ కార్డు కూడా ఉంది. ఆమెకు 83 శాతం అంగవైకల్యం ఉంది. మరుగుజ్జుతనం, బుద్ధిమాంద్యం, పుట్టుకతోనే ఆర్థోపెడిక్ సమస్యలున్నాయి. ఆమెను కూడా పింఛన్‌కు దూరం చేశారు.



వైఎస్సార్‌సీపీ ఆవిర్భవించక ముందే పెన్షన్ మంజూరైన వీరిద్దరికీ కూడా రద్దు చేశారు. 40 శాతానికి మించిన వైకల్యం ఉన్నా.. వారి హృదయాలను ముక్కలు చేశారు. దీనికేమంటారు స్పీకర్ గారూ..?

దివ్యాంగులపై కక్ష

వారి వైకల్యానికి మరో పరీక్ష

అర్హత లేదంటూ తిరస్కారం

వారి గుండెకు తీరని గాయం

వైకల్యంతో పుట్టడం బాధాకరం. దివ్యాంగుల్లా నటిస్తున్నారని చెప్పడం మరింత బాధాకరం. మొదటిది విధి వైపరీత్యమైతే.. రెండోది కూటమి నేతల కుటిల నీతికి నిదర్శనం. సామాజిక పింఛన్ మొత్తాన్ని పెంచుతామని గొప్పలు చెప్పి.. అధికారంలోకి వచ్చాక కుంటి సాకులు చెబుతూ లబ్ధిదారుల సంఖ్యను తగ్గించేందుకు వికృత క్రీడ ఆడుతున్నారు.

కూటమి సర్కారు కక్ష సాధింపు.. దివ్యాంగ పెన్షన్ల తొలగింపు

జిల్లాలో మొత్తం దివ్యాంగ పింఛనుదార్లు **30,688**	వీరిలో రీవెరిఫికేషన్ చేసినవారు **12,964**
అనర్హులని చెబుతున్నవారు **4,148**	
వారిలో ఆరోగ్య పింఛన్లు **120** మందికి..	వృద్ధాప్య పింఛన్లు **679** మందికి మంజూరు
చివరకు పింఛనుకు దూరమైన వారు **3,349**	



శాంతాకుమారి అంగవైకల్య ధ్రువీకరణ పత్రం

సాక్షి, అనకాపల్లి: దివ్యాంగులుగా పుట్టడమే పాపమా..? కూటమి సర్కారు అధికారంలోకి రావడం వారికి శాపమా..? అవును.. రీవెరిఫికేషన్ పేరిట కూటమి ప్రభుత్వం అర్హులున్న దివ్యాంగుల పింఛన్లలో భారీ కోత విధిస్తోంది. పది పదిహేనేళ్లుగా పెన్షన్లు తీసుకుంటున్న వారికి కూడా కోత విధించింది. అంగవైకల్యం 40 శాతానికి పైగా ఉండాలంటున్నారు. కానీ 75 శాతానికి పైగా ఉన్నా కూడా పింఛన్లు కట్ చేశారు. ప్రధానంగా వృద్ధులు, వికలాంగులు, దీర్ఘకాలిక వ్యాధులు బారిన పడిన వారి పింఛన్లను రీవెరిఫికేషన్ పేరిట ఏరివేస్తున్నారు. చంద్రబాబు సర్కార్ అధికారం చేపట్టినప్పటి నుంచి నేటి వరకూ జిల్లాలో రూ.6 వేలు పింఛను తీసుకునే దివ్యాంగుల్లో 12,964 మందిని రీవెరిఫికేషన్ జాబితాలో చేర్చారు. వారిలో 4,148మందిని అనర్హులుగా ప్రకటించారు. కొందరికి ఆరోగ్య, వృద్ధాప్య పింఛన్లు మంజూరు చేసి, చివరకు జిల్లా వ్యాప్తంగా 3349 మంది దివ్యాంగ పింఛన్లు ఎగవేశారు. మళ్లీ అంగవైకల్యం ధ్రువపత్రాలు తెచ్చుకోవాలంటూ వేధిస్తున్నారు. తొలగించిన దివ్యాంగ పింఛనుదారులకు సంబంధిత ఎంపీడీఓ కార్యాలయంలో నెలరోజుల్లోగా అప్పీల్ చేసుకునే వెసులుబాటు కల్పించారు.

తొలి నెల నుంచీ వంచనే..

కూటమి సర్కారు తొలి నెల నుంచే తన కుటిల నీతిని అమలు చేస్తోంది. పెన్షన్ మొత్తం పెంచినట్టే పెంచి, లబ్ధిదారుల సంఖ్యను భారీగా తగ్గిస్తోంది. చంద్రబాబు ప్రభుత్వానికి ఇది మామూలే. గతంలో 14 ఏళ్లు సీఎంగా పని చేసినప్పుడు కూడా ఇలాగే అవ్వా తాతలు, వికలాంగులను వేధించుకుతిన్నారు. మళ్లీ అదే పరిస్థితి పునరావృతమవుతోంది. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని అభిమానిస్తున్నారనే అక్కసుతో అవ్వాతాతలు, దివ్యాంగుల పింఛన్ తొలగించి పగ తీర్చుకుంటున్నారు.

అంధురాలికి అన్యాయం

వచ్చే నెల నుంచి పింఛన్ నిలిపివేస్తున్నట్టు ప్రభుత్వం నుంచి వర్తమానం



తల్లితో అంధురాలు ఈగల శాంతాదేవి

పాయకరావుపేట: పుట్టుకతోనే ఆమె అంధురాలు. దివ్యాంగుల సామాజిక పింఛన్ రూ.1500 ఉన్నప్పటి నుంచి అందుకుంటోంది. వచ్చే నెల నుంచి పెన్షన్ నిలిపివేస్తున్నట్టు హఠాత్తుగా ప్రభుత్వం నుంచి వర్తమానం అందడంతో ఆమె కంగుతింది. కంగారు పడింది. తనకు దిక్కెవ్వరని లబోదిబోమంటోంది. పట్టణంలో నివసిస్తున్న ఈగల సత్తిబాబు, లోవతల్లి దంపతుల కుమార్తె ఈగల శాంతాదేవి. ఒకటో తరగతి నుంచి ఇంటర్ వరకు బొబ్బిలిలోని 'ఆసియాన్ ఎయిడ్ స్కూల్ ఫర్ ది బ్లైండ్' పేరుతో నడుస్తున్న అంధుల పాఠశాలలో చదువుకుంది. డిగ్రీ విజయనగరంలోని ఏజీఎల్ కళాశాల పూర్తి చేసింది. తనకు పూర్తి స్థాయిలో అంధత్వం ఉందని, ప్రతి నెల రూ.6 వేల పింఛన్ వచ్చేదని 'సాక్షి'కి వివరించింది. మార్చి నెలలో జరిగిన సదరం సర్టిఫికెట్ల పరిశీలనలో 40 శాతం మాత్రమే వైకల్యం ఉందని నిర్ధారణ జరిగినందున పింఛన్ నిలిపివేస్తున్నట్టు మండల పరిషత్ కార్యాలయం నుంచి లెటర్ వచ్చిందని తెలిపింది. తన తల్లిదండ్రులు వృద్ధులని, తండ్రి ఒక రైతు వద్ద పశువుల కాపరిగా పనిచేస్తున్నారని వివరించింది. తనకు ఉద్యోగం రాలేదని, పింఛను పైనే ఆధారపడి జీవిస్తున్నానని, అధికారులు స్పందించి న్యాయం చేయాలని ఆమె వేడుకుంటోంది.

పెన్షన్లు పీకేస్తే.. ప్రజలు మిమ్మల్ని పెకిలిస్తారు

కూటమి ప్రభుత్వానికి వైఎస్సార్‌సీపీ యలమంచిలి సమన్వయకర్త ధర్మశ్రీ హెచ్చరిక



అచ్యుతాపురం మండలంలో నిర్వహించిన బాబు షూరిటీ.. మోసం గ్యారంటీ సభలో మాట్లాడుతున్న కరణం ధర్మశ్రీ



పాల్గొన్న ప్రజలు

అచ్యుతాపురం: అధికారం ఉంది కదా అని పెన్షన్లను ఇష్టారాజ్యంగా పీకేస్తున్నారని.. కూటమి ప్రభుత్వాన్ని ప్రజలు పెకిలించే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని యలమంచిలి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త కరణం ధర్మశ్రీ అన్నారు. బాబు షూరిటీ.. మోసం గ్యారంటీ కార్యక్రమాల్లో భాగంగా బుధవారం మండలంలోని తంతడి, రాజన్నపాలెం, నునపర్తి గ్రామాల్లో నిర్వహించిన బహిరంగ సభల్లో ఆయన మాట్లాడారు. అభాగ్యుల పెన్షన్లు రద్దు చేసి ఏం సాధిస్తారని, ప్రజలకు అండగా నిలవడం నేర్చుకోవాలని హితవు పలికారు. తంతడి పరిధిలోని బార్క్ భూములు కోల్పోయిన వారి జాబితా తయారీలో బినామీలను చేరుస్తున్నారని, అటువంటి చర్యలను అంగీకరించేది లేదని హెచ్చరించారు. బార్క్ నిర్వాసితుల తరఫున పోరాడతామన్నారు. మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాటకు కట్టుబడే వ్యక్తి కాబట్టి అమలు సాధ్యం కానీ హామీలు ఇవ్వలేదన్నారు. ఫ్రీ బస్ ప్రకటించడం గొప్ప కాదని, ముందు అన్ని గ్రామాలకు బస్సులు వెళ్లేలా చేస్తే అప్పుడు మహిళలకు ఈ పథకం ఉపయోగపడుతుందన్నారు. నియోజకవర్గంలోని మత్స్యకార సమస్యలపై పోరాడతామని పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు దేశంశెట్టి శంకర్‌రావు, జెడ్పీటీసీ లాలం రాంబాబు, కో ఆప్షన్ జెడ్పీటీసీ నర్మాల కుమార్, పార్టీ నాయకుడు కోన బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

పరారీలో ఉన్న గంజాయి నిందితుడి అరెస్ట్



పోలీసుల అదుపులో గంజాయి నిందితుడు అంబర్ ఖాన్

యలమంచిలి రూరల్: జాతీయ రహదారిపై యలమంచిలి రూరల్ పోలీస్ స్టేషన్ పరిధి రేగుపాలెం వద్ద 2021లో 220 కేజీల గంజాయి పట్టుబడింది. ఈ కేసులో పోలీసులు ఏ1 గా పేర్కొన్న నిందితుడు అంబర్ ఖాన్(30)ని మధ్యప్రదేశ్‌లోని షాజపూర్ జిల్లా జామ్నర్, వీటీసీ, ఛత్రబాస్ దగ్గర యలమంచిలి రూరల్ ఎస్ఐ ఎం.ఉపేంద్ర, మరో ఇద్దరు పోలీసుల బృందం అరెస్ట్ చేసి బుధవారం యలమంచిలి తీసుకొచ్చారు. అనంతరం విశాఖపట్నం కోర్టులో హాజరుపర్చగా నిందితుడికి జ్యుడీషియల్ రిమాండ్ విధించారు. ఈ కేసులో నలుగురు నిందితుల్లో ఇద్దర్ని 2021లో అరెస్టు చేయగా ఇద్దరు తప్పించుకుని తిరుగుతున్నారు. వీరిలో ఒకర్ని అరెస్టు చేయగా మరొకరు పరారీలో ఉన్నాడు.

పలు చోరీ కేసుల్లో నిందితుడి అరెస్టు



విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రావణి

అనకాపల్లి టౌన్: పలు చోరీ కేసులలో నిందితుడిని అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ శ్రావణి తెలిపారు. స్థానిక డిఎస్‌పి కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ చోడవరం మండలం తిమ్మన్నపాలెం గ్రామంలో ఈ నెల ఏడు నుంచి 18వ తేదీ వరకు ఐదు ఇళ్లలో దొంగతనాలకు పాల్పడిన నిందితుడు కన్నూరి విష్ణుమూర్తిని అరెస్ట్ చేసి, నుంచి నాలుగున్నర తులాల బంగారం స్వాధీనం చేసుకున్నామన్నారు. జల్సాలకు అలవాటు పడ్డ ఈ యువకుడు చిన్న చిన్న దొంగతనాలకు పాల్పడుతుంటాడని తెలిపారు. సమావేశంలో చోడవరం సీఐ పి.అప్పలరాజు, ఎస్ఐ నాగకార్తీక్, సిబ్బంది పాల్గొన్నారు.

బెడ్ షీట్లలో భారీ అవినీతి


- వివిధ రైల్వే జోన్ల పరిధిలో బెడ్ షీట్స్ కుంభకోణం
- ఏసీ కోచ్ ప్రయాణికులకు బెడ్ షీట్స్ సరఫరా
- ఏటా వీటిని కొనుగోలు చేస్తున్న ఆయా రైల్వే జోన్లు
- ఒక్కో జోన్ పరిధిలో ఒక్కో ధరకు బెడ్ షీట్స్ కొనుగోలు

సాక్షి, విశాఖపట్నం: ఇటీవల రైల్వే శాఖలో అవినీతి తారస్థాయికి చేరుకుంటోంది. డీఆర్ఎంలు, సీనియర్ ఇంజినీర్లు వరుసగా సీబీఐ దాడుల్లో పట్టుబడుతున్న నేపథ్యంలో మరో కుంభకోణం బట్టబయలైంది. కాదేదీ కుంభకోణానికి అనర్హం అన్నట్లుగా ఏసీ కోచ్‌లలో సరఫరా చేసే బెడ్‌షీట్ల కొనుగోళ్లలోనూ చేతివాటం ప్రదర్శిస్తున్నారు. ఒక్కో జోన్ పరిధిలో ఒక్కో ధరకు బెడ్‌షీట్లు కొనుగోలు చెయ్యడం చూస్తుంటే భారీగా ముడుపులు చేతులు మారుతున్నట్లు స్పష్టమవుతోంది. ముఖ్యంగా దక్షిణ మధ్య రైల్వే జోన్ ఈ విషయంలో ముందువరసలో ఉంది. సాధారణంగా కొన్ని జోన్‌లు ఒక్కో బెడ్‌షీట్ రూ.147 కి కొనుగోలు చేస్తుండగా అనేక జోన్లు మాత్రం ఏకంగా రూ.300కి పైగా కొనుగోలు చెయ్యడం వెనుక భారీ అవినీతి దాగి ఉందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. రెండేళ్ల క్రితం సీబీఐ దర్యాప్తు చేపట్టినా మళ్లీ ఈ కుంభకోణం వ్యవహారం షురూ అయ్యింది. దీంతో మరోసారి సీబీఐ దీనిపై దృష్టిసారించడంతో అన్ని రైల్వే జోన్లలో ఈ బెడ్‌షీట్ల కుంభకోణం బట్టబయలయ్యే అవకాశాలు స్పష్టమవుతున్నాయి.



ఇండియన్ రైళ్లలో థర్డ్ ఏసీ, సెకెండ్ క్లాస్, ఫస్ట్ క్లాస్ ఏసీ కోచ్‌లలో ప్రయాణికులకు బెడ్‌షీట్లు సరఫరా చేస్తుంటారు. ఈ బెడ్‌షీట్లను అన్ని జోన్లు దాదాపు ఒకే దగ్గర కొనుగోలు చేస్తుంటాయి. కొన్నాళ్ల క్రితం ఓ రైలులో బెడ్‌షీట్లు నాసిరకంవి సరఫరా చేసినట్లు ఓ ప్రయాణికుడు ఫిర్యాదు చేశాడు. దీనిపై ఆరాతీసిన రైల్వే బోర్డు ఉన్నతాధికారులకు దిమ్మతిరిగే షాక్ కలిగింది. ఈ బెడ్‌షీట్ల కొనుగోలు వెనుక భారీ కుంభకోణం జరిగినట్లు గుర్తించారు. సుమారు అన్ని జోన్లలోనూ ఇదే తరహా వ్యవహారం నడుస్తున్నట్లు తెలుస్తోంది. ఈ నాసిరకం బెడ్‌షీట్లపై దర్యాప్తు చెయ్యగా దాని వెనుక ఉన్న బండారాన్ని బయటకు లాగే పనిలో సీబీఐ అధికారులు మరోసారి నిమగ్నమైనట్లు సమాచారం. 2023 నుంచి ఈ కొనుగోళ్ల వ్యవహారంలో అవినీతి రాజ్యమేలుతున్నట్లు గుర్తించారు.

అక్కడ రూ.147.. కానీ.. ఇక్కడ మాత్రం రూ.377



దక్షిణ మధ్య రైల్వే అధికారులు ఈ బెడ్‌షీట్లను కాన్పూర్‌కి చెందిన సహకారి సమితి లిమిటెడ్ వద్ద కొనుగోలు చేసినట్లు గుర్తించారు. దాదాపు రూ.7.86 కోట్లతో 2,54, 657 బెడ్‌షీట్లను కొనుగోలు చేసినట్టు తెలుస్తోంది. ఈస్ట్‌కోస్ట్‌రైల్వే రూ.141.75కి కొనుగోలు చెయ్యగా.. ఈస్టర్న్ రైల్వే జోన్ రూ.189 వెచ్చించారు. కానీ దక్షిణ మధ్య రైల్వే మాత్రం 2023లో ఏకంగా రూ.377 కి కొనుగోలు చేసింది. దీనిపై సీబీఐ అధికారులు దర్యాప్తు చేశారు. కుంభకోణాన్ని బట్టబయలు చేశారు. అయినా అదే కుంభకోణం మరోసారి జరుగుతున్నట్లు తెలుస్తోంది. దాదాపు అన్ని రైల్వే జోన్లు అధిక ధరకు ఈ బెడ్‌షీట్లను కొనుగోలు చేసి భారీగానే లబ్ధి పొందుతున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. రెట్టింపు కంటే ఎక్కువ ధరకు కొనుగోలు చెయ్యాల్సిన అవసరం ఏముందనే అంశంపై సీబీఐ ఆరా తీస్తోంది. ఇప్పటికే అన్ని జోన్లలో గత ఐదేళ్ల కాలంలో జరిగిన బెడ్‌షీట్లను ఎంత ధరకు కొనుగోలు చేశారు..ఎందుకు కొనుగోలు చేశారనే ఫైళ్లని సేకరిస్తున్నట్లు తెలుస్తోంది. కొన్ని రైల్వే జోన్లు దాదాపు 63 శాతం అధిక ధరను బెడ్‌షీట్ల కోసం వెచ్చించినట్లు సమాచారం. ఈ వ్యవహారంపై సీబీఐ దర్యాప్తు చేసేందుకు సిద్ధమవుతోందని తెలియడంతో ఈస్ట్‌కోస్ట్ రైల్వే జోన్‌లోనూ కలకలం మొదలైంది. మొత్తంగా ఈ బెడ్‌షీట్ల కుంభకోణం బట్టబయలైతే.. దాదాపు 10 జోన్లలో ఉన్నతాధికారులు ఇందులో చిక్కుకునే అవకాశం ఉందని రైల్వే వర్గాలు భావిస్తున్నాయి.

25 నుంచి కొత్త స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

కలెక్టర్ విజయ కృష్ణన్

తుమ్మపాల: ఈ నెల 25 నుంచి కొత్త స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీకి చర్యలు చేపట్టాలని కలెక్టర్ విజయ కృష్ణన్ రెవెన్యూ, పౌరసరఫరాల అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో పిజిఆర్ఎస్ అర్జీలు, అందరికీ ఇళ్లు, భూముల క్రమబద్ధీకరణ, భూ సర్వే , కోర్టు కేసులు, అన్నదాత సుఖీభవ, రేషన్ పంపిణీ, మ్యుటేషన్లు, ఏపీ సేవా సర్వీసులు, నీటి తీరువా వసూళ్లు, ఇంటి స్థల దరఖాస్తుల పరిశీలన, తదితర అంశాలపై జేసీ జాహ్నవి, డీఆర్వో సత్యనారాయణరావుతో కలిసి కలెక్టరేట్ మినీ కన్ఫరెన్స్ హాల్ నుంచి ఆర్డీవోలు, తహసీల్దార్లు, ఉప తహసీల్దార్లు, మండల సర్వేయర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రభుత్వ ఇంటి స్థలం కోసం వచ్చే ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి అర్హుల వివరాలు ఆన్‌లైన్‌లో ఎప్పటికప్పుడు అప్లోడ్ చేయాలన్నారు. వివాదం లేని ఆక్రమిత ప్రభుత్వ భూములలో ఇంటి నిర్మాణం చేసి క్రమబద్ధీకరణ కోసం దరఖాస్తు చేసిన లబ్ధిదారుల వివరాలను పరిశీలించి వెంటనే ముగించాలని ఆదేశించారు. అన్నదాత సుఖీభవ కోసం ఇంకా ఏమైనా దరఖాస్తులు పెండింగ్‌లో ఉంటే దానికి గల కారణం పరిశీలించి ఆధార్ సీడింగ్ వంటి కార్యక్రమాలను పూర్తి చేయాలని ఆదేశించారు. నీటి తీరువా వసూళ్లు ఆగస్టు నాటికి పూర్తిచేయాలని చెప్పారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ విజయ కృష్ణన్, జేసీ జాహ్నవి

బాల్య వివాహాలపై అవగాహన సదస్సులు

బాల్య దశలో వివాహాలు జరగకుండా, కౌమార దశలో గర్భం దాల్చకుండా అవగాహన సదస్సులు నిర్వహించాలని కలెక్టర్ విజయ కృష్ణన్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మాసంతపు జిల్లా స్థాయి బాలల సంక్షేమ, రక్షణ కమిటీ సమీక్షలో ఆమె మాట్లాడారు. జిల్లాలో అన్ని మండల, గ్రామ, వార్డు పరిధిలో బాలల సంక్షేమ, రక్షణ కమిటీలను ఏర్పాటు చేయాలన్నారు. బాలలు మత్తు మందులకు బానిస కాకుండా, వారికి స్నేహపూర్వక వాతావరణాన్ని కల్పించాలని కమిటీ సభ్యులను ఆదేశించారు. ప్రత్యేక ఉప కలెక్టర్ ఎస్.సుబ్బలక్ష్మి, జిల్లా పౌర సరఫరాల అధికారి కె.ఎల్.ఎస్.మూర్తి, బాలల సంరక్షణ అధికారి రమేష్, జెడ్పీ సీఈవో నారాయణమూర్తి, డీఎంహెచ్‌వో హైమావతి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అదనపు వసూళ్లు, ఒత్తిళ్లు భరించలేం

మద్యం దుకాణాలు బంద్ చేసిన నిర్వాహకులు

ఎస్.రాయవరం: రూ.లక్షల ఖర్చు చేసి ఏర్పాటు చేసుకున్న లైసెన్స్ మద్యం దుకాణాలపై అదనపు వసూళ్లు, అధికారులు ఒత్తిళ్లు పెరిగిపోయాయని మండలంలో ఉన్న ఏడు మద్యం దుకాణాలకు తాళాలు వేసి బుధవారం బంద్ ప్రకటించారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత నూతన మద్యం పాలసీలో లక్షల రూపాయలు పెట్టుబడులు పెట్టి దుకాణాలు పెట్టుకుంటే ప్రభుత్వం ఇస్తానన్న 20 శాతం కమీషన్‌లో కోత విధించి, మొదటి 5 శాతం 6 నెలలు గడిచాక 13 శాతం ఇస్తున్నారన్నారు. ఇప్పుడు కొత్తగా దుకాణాలు వద్ద మద్యం సేవించేందుకు సిట్టింగ్ పర్మిట్ రూమ్ అంటూ చలానాలు కట్టమంటున్నారన్నారు. అవి ఏర్పాటు చేసుకున్న వారు కడదామనుకుంటే సిట్టింగ్ రూమ్‌లు ఏర్పాటు చేసుకున్నా లేకున్నా చలానా నగదు కట్టాలని అధికారులు ఒత్తిళ్లు చేసి, షాపు ముందు మద్యం సేవించే వారిపైనా, అమ్మిన వారిపైన అక్రమంగా కేసులు నమోదు చేస్తున్నారన్నారు. ఇప్పటికే రూ.లక్షల్లో నష్టాలు భరిస్తున్న తమను ఇంకా వేధిస్తున్నారన్నారు. ఈ క్రమంలో తాము దుకాణాలు తెరవలేమని బంద్ ప్రకటిస్తున్నట్టు తెలిపారు. ప్రభుత్వ అధికారు తమ ఇబ్బందులు పరిగణనలోనికి తీసుకుని న్యాయం చేసే వరకు దుకాణాలు తెరవబోవమని చెప్పారు. ఈ ఆందోళనలో గుర్రం నానాజీ, కోయలాడ కమల్, రామకృష్ణ, దొరాజీ తదితరులు పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న మద్యం దుకాణాల యజమానులు, నిర్వాహకులు

‘మధ్యాహ్న భోజనం’ రుచికరంగా ఉండాలి

కశింకోట: పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని రుచికరంగా మెనూ ప్రకారం అందించే బాధ్యత ప్రధానపాధ్యాయులదేనని, బాధ్యతారహితంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని జిల్లా విద్యా శాఖ అధికారి గిడ్డి అప్పారావు నాయుడు హెచ్చరించారు. కశింకోటలోని డీపీఎన్ జెడ్పీ హైస్కూలులో బుధవారం జిల్లాలోని రెండు నెలల క్రితం ఎంపిక చేసిన 56 పాఠశాలల్లో గుర్తించిన సమస్యల పరిష్కారం విషయమై సామాజిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని రోజూ హెచ్ఎం తనిఖీ చేసి రుచికరంగా మనూ ప్రకారం ఉందా? లేదా? అనే విషయాన్ని తప్పనిసరిగా పరిశీలించాల్సిన బాధ్యత ఉందన్నారు. జిల్లాలో ఎంపిక చేసిన 56 స్కూళ్లలో ఇక్కడ సామాజిక తనిఖీ పూర్తి చేసినట్టు తెలిపారు. పాఠశాలల్లో సమస్యలపై రెండు నెలల క్రితం గ్రామ సభలు నిర్వహించి గుర్తించిన సమస్యల్లో కొన్ని పరిష్కరించి, తమ స్థాయిలో పరిష్కారం కాని సమస్యలను ప్రభుత్వానికి నివేదించాలని ఆయా పాఠశాలల హెచ్ఎంలు, ప్రిన్సిపాళ్లు, ప్రత్యేక అధికారులకు సూచించామన్నారు.

పాఠశాలల్లో గతంలో నాడు-నేడులో చేపట్టి నిలిచిపోయిన భవనాలపై ప్రభుత్వానికి నివేదించామన్నారు. స్టేట్ రిసోర్స్ పర్సన్ టి. రాజేంద్రరావు, ఎంఈఒలు మూర్తి, సురేష్‌కుమార్, జిల్లా రిసోర్సు పర్సన్లు, సామాజిక తనిఖీ స్కూళ్ల హెచ్ఎంలు, మోడల్ స్కూళ్ల ప్రిన్సిపాళ్లు, కస్తూర్బాగాంధీ విద్యాలయాల ప్రత్యేక అధికారులు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.



డీపీఎన్ జెడ్పీ హైస్కూల్లో సామాజిక తనిఖీ నిర్వహిస్తున్న జిల్లా విద్యాశాఖ అధికారి అప్పారావునాయుడు

దోమలను పారదోలుదాం



జెండా ఊపి ర్యాలీ ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో హైమావతి

అనకాపల్లి: వర్షాలు పడుతున్న కారణంగా ప్రజలు దోమలు బారిన పడకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని డీఎంహెచ్‌వో ఎం.హైమావతి అన్నారు. ప్రపంచ దోమల దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక భీమునిగుమ్మం హైస్కూల్ రహదారిలో బుధవారం ర్యాలీ నిర్వహించారు. అనాఫిలస్ ఆడ దోమ ద్వారా మలేరియా వ్యాప్తి చెందుతుందని సర్ రోనాల్డ్ రాస్ చెప్పినట్లు ఆమె తెలిపారు. దోమల ద్వారా వ్యాపించే వ్యాధుల నివారణకు ఉమ్మడి భాగస్వామ్యంతో ఉద్యమిద్దామన్నారు. వారంపైబడిన నీటి నిల్వలు తొలగించాలని, దోమల పెరుగుదలను నివారించి ఆరోగ్యంగా జీవించేందుకు ప్రతి వ్యక్తి కృషి చేయాలని అన్నారు. నిద్రించేటప్పుడు దోమతెరలు తప్పకుండా వాడాలని, ఇంటి కిటికీలు, తలుపులకు దోమలు రాకుండా మెష్‌లు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి కె.వరహాలుదొర, జోనల్ కమిషనర్ చక్రవర్తి, ఏఎస్ఎంలు, ఆశ వర్కర్స్ పాల్గొన్నారు.

అశ్లీల నృత్యాల ఘటనలో మరొకరిపై కేసు

యలమంచిలి రూరల్: మండలంలోని ఏటికొప్పాకలో ఈ నెల 17వ తేదీ రాత్రి శ్రీకృష్ణాష్టమి వేడుకల ముసుగులో ముగ్గురు యువతులతో అశ్లీల నృత్యాలు వేయించిన కేసులో బుధవారం మరొక నిందితుడిని చేర్చారు. యువతులను ఏటికొప్పాకకు తీసుకొచ్చిన అనకాపల్లికి చెందిన ఆర్గనైజర్‌గా వ్యవహరించిన మరొకరిని యలమంచిలి రూరల్ పోలీస్ స్టేషన్‌కు పిలిపించి నిందితుడిగా నమోదు చేసినట్టు తెలిపారు. దీంతో ఈ కేసులో నిందితుల సంఖ్య 8కి చేరింది. ఇప్పటికే మంగళవారం ఈ కేసుకు సంబంధించి ఏటికొప్పాకకు చెందిన ఏడుగురిపై పోలీసులు కేసు నమోదు చేసిన సంగతి తెల్సిందే.

ట్రాక్టర్, ఆటో ఢీకొని ఒకరి మృతి

గొలుగొండ: కృష్ణదేవిపేట ప్రాంతంలో బుదవారం రాత్రి ట్రాక్టర్- ఆటో ఢీకొన్న సంఘటనలో ఒకరు మృతి చెందడం జరిగింది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. అల్లూరి జిల్లా కొయ్యూరు మండలంలో కూలి పనికోసం కృష్ణదేవిపేటకు చెందిన ఐదుగురు ఆటోలో వెళ్లి వస్తున్న సమయంలో కృష్ణదేవిపేట నుండి కొయ్యూరు వెళుతున్న ట్రాక్టర్ ఆటోను ఢీకొట్టడంతో ఆటో ప్రయాణం చేస్తున్న ఎం.చిన్న(35) మృతి చెందగా మరో ఇద్దరికి తీవ్ర గాయాలు తగలడంతో నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు. దీనిపై కృష్ణదేవిపేట పోలీసులు విచారణ చేస్తున్నారు.

మహిళ అదృశ్యంపై కేసు నమోదు



రాజాన లక్ష్మి

యలమంచిలి రూరల్: పట్టణంలోని పాతవీధికి చెందిన వివాహిత మహిళ రాజాన లక్ష్మి(43) ఈ నెల 19వ తేదీ మంగళవారం ఉదయం 8 గంటల నుంచి కనిపించడం లేదని ఆమె భర్త రాజాన వెంకట రవి మోహన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. గిడిజాలలో ఉన్న చిన్న కుమారుడి వద్దకు వెళతానని చెప్పి ఈ నెల 19 ఉదయం వెళ్లిన ఆమె తిరిగి ఇంటికి రాలేదు. ఇంటి నుంచి వెళ్లినపుడు ఆమె ఎరుపు రంగు చీర ధరించి ఉన్నట్టు ఆమె భర్త పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పట్టణ ఎస్ఐ కె.సావిత్రి తెలిపారు.

డివైడర్‌ను ఢీకొట్టిన కారు



డివైడర్‌ను ఢీకొనడంతో దెబ్బతిన్న కారు ముందు భాగం

మాకవరపాలెం: రోడ్డుమధ్యలో ఉన్న డివైడర్‌ను కారు ఢీ కొట్టింది. తాళ్లపాలెం వైపు నుంచి నర్సీపట్నం వెళుతున్న కారు బుధవారం రాత్రి మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండు వద్దకు వచ్చేసరికి రోడ్డు మధ్యలో ఉన్న డివైడర్‌ను ఒక్కసారిగా ఢీ కొట్టింది. దీంతో కారు ముందు భాగం దెబ్బతింది. కారులో ఉన్న వ్యక్తి ఎలాంటి గాయాలు లేకుండా బయటపడ్డాడు. దీంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. ఎదురుగా వస్తున్న వాహన లైట్ల వెలుగులో డివైడర్ కనిపించక పోవడంతోనే ఢీకొట్టినట్టు కారు యజమాని తెలిపాడు. డివైడర్‌కు రేడియం స్టిక్కర్లు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

స్కూటీ చోరీ కేసులో ఏడాది జైలు

కశింకోట: కశింకోటలో స్కూటీ దొంగతనం కేసులో నిందితునికి ఏడాది కఠిన కారాగార శిక్ష, రూ.5 వేల జరిమానా విధిస్తూ అనకాపల్లి 12వ అదనపు మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టు జడ్జి బి.వి. విజయలక్ష్మి బుధవారం తీర్పు ఇచ్చారు. ఈ విషయాన్ని సీఐ అల్లు స్వామినాయుడు విలేకరులకు తెలిపారు. కశింకోట శివారులో వేంకటేశ్వర ఎల్ఎల్‌పి షో రూం ముందు పార్కు చేసిన భాను ప్రకాష్‌కు చెందిన డిస్కు స్కూటీ 2024 ఆగస్టులో అపహరణకు గురైంది. ఈ మేరకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పట్లో కేసు నమోదు చేశారు. దర్యాప్తు అనంతరం అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలంలోని మడికి గ్రామానికి చెందిన కావిడి నానిసింగం ఎలియాస్ లాజర్ దొంగిలించినట్లు గుర్తించి అరెస్టు చేసి సీఐ స్వామినాయుడు కోర్టులో ఛార్జీ షీట్ దాఖలు చేశారు. కోర్టులో విచారణలో అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఆర్. వాణి వాదనలు బలంగా వినిపించడంతో నిందితునికి ఏడాది జైలు, జరిమానా విధిస్తూ జడ్జి తీర్పు ఇచ్చారని సీఐ తెలిపారు.

స్థానిక ఎన్నికల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించాలి

తుమ్మపాల: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించాలని బహుజన్ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్ వద్ద ధర్నా చేసి జిల్లా రెవెన్యూ అధికారి వై.సత్యనారాయణరావుకు వినతిపత్రం అందించారు. బహుజన సమాజ్ పార్టీ ఉత్తరాంధ్ర జిల్లాల ఇంచార్జి బోని కృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వ లెక్కల ప్రకారం జనాభాలో 52 శాతానికి మించి ఉన్న బీసీ కులాల ప్రజలు ఆర్థిక, రాజకీయ, సామాజిక రంగాలలో ఎటువంటి ప్రాధాన్యం అందుకోలేకపోతున్నారని, ప్రభుత్వ సంక్షేమ రంగంలో బీసీలకు రావలసిన వాటా దక్కించుకోలేకపోతున్నారన్నారు. రాజ్యాధికారంలో బీసీలకు దక్కవలసిన వాటా వారికి దక్కకపోవడమే కారణమన్నారు. బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 50 శాతం రిజర్వేషన్ కల్పించి న్యాయం చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చూపించినట్టయితే ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తామన్నారు. కార్యక్రమంలో బహుజన్ సమాజ్ పార్టీ జిల్లా ఇన్‌చార్జ్ పండూరి దుర్గారావు, పార్టీ జిల్లా అధ్యక్షుడు గంటా సూరిబాబు, ఉపాధ్యక్షుడు కంకణాల శ్రీను, ప్రధాన కార్యదర్శి పరవాడ అప్పారావు, కార్యదర్శి గురుమూర్తి, కోశాధికారి నూకరాజు, జిల్లా అడ్వైజర్ సత్యనారాయణ, సుహాసిని, పార్టీ నాయకులు రామచంద్రరావు, జిల్లా ఇన్‌చార్జ్ మాణిక్యాలరావు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి యోగా పోటీలకు ఎంపిక

పాయకరావుపేట: కాకినాడలో జరిగిన సీబీఎస్ఈ సౌత్ జోన్ యోగా పోటీలకు శ్రీ ప్రకాష్ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అండర్-14 బృందం విభాగంలో చైతన్యసాగర్ నాయుడు, మాహేశ్వరి, వి.చైతన్య తేజ, ఆశ్రిత్ చరణ్ కుమార్, వ్యక్తిగత విభాగంలో చరణ్‌కుమార్, అండర్ -17 బృంద విభాగంలో జి.సోమ సూర్యచరణ్, బి.దేవాన్ష్ నాయుడు, పి.సోహన్, సిహెచ్.జయదీప్, రక్షిత్, సెప్టెంబర్ 13 నుంచి సెప్టెంబర్ 16 వరకు శ్రీరామ్ గ్లోబల్ స్కూల్, న్యూవల్, హరియాణాలో జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. సంప్రదాయ ఈవెంట్‌లో జి.సోమ సూర్యచరణ్ బంగారు పతకం, దేవన్ష్ నాయుడు రజత పతకం, సిహెచ్ రక్షిత్ కాంస్య పతకం, పి.సోహన్ 4వ స్థానం సాధించారు. ఆయా విద్యార్థులను విద్యా సంస్థల అధినేత నరసింహారావు, సంయుక్త కార్యదర్శి విజయ్ ప్రకాష్, సీనియర్ ప్రిన్సిపాల్ మూర్తి, యోగా గురువులు సురేష్, జయంతి అభినందించారు.



యోగా పోటీలకు ఎంపికైన విద్యార్థులు

ముగిసిన రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు

మహిళా విభాగం విజేత విశాఖ జట్టు

మునగపాక: నాగులాపల్లిలో మూడు రోజులపాటు ఏర్పాటు చేసిన రాష్ట్ర స్థాయి మహిళలు, పురుషుల కబడ్డీ పోటీలు బుధవారం రాత్రితో ముగిశాయి. యలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ జన్మదినం సందర్భంగా అనకాపల్లి మార్కెట్ కమిటీ మాజీ వైస్ ఛైర్మన్ దొడ్డి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహించారు. 8 జిల్లాలకు సంబందించిన మహిళలు, పురుషుల కబడ్డీ క్రీడాకారులు ఈ పోటీలకు హాజరయ్యారు. కబడ్డీ అసోసియేషన్ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి ఉరుకూటి శ్రీనివాసరావు ఇతర సభ్యుల సహకారంతో పోటీలు విజయవంతంగా ముగిసాయి. మహిళల విభాగంలో విశాఖ జట్టుకు ప్రథమ స్థానం, శ్రీకాకుళం జట్టుకు ద్వితీయ స్థానం దక్కాయి. విజేతలకు ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ బహుమతులు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే విజయకుమార్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో దొడ్డి శ్రీనివాసరావు మిత్రమండలి సభ్యులు పాల్గొన్నారు.



ఫైనల్ పోటీల్లో తలపడుతున్న విశాఖ-శ్రీకాకుళం మహిళా జట్లు

ఎట్టకేలకు డిగ్రీ అడ్మిషన్లు

- ఏయూ పరిధిలో 196 కాలేజీలకు గుర్తింపు
- ఆన్‌లైన్‌లో నమోదుకు ఈ నెల 25 వరకు గడువు
- ఈ ఏడాది కాలేజీలపై తనిఖీలు నిల్
- అనుమతుల్లేకున్నా అడ్డగోలుగా ప్రవేశాలు కల్పిస్తున్న ప్రైవేటు యాజమాన్యాలు

విశాఖ విద్య : డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలు ఎట్టకేలకు బుధవారం నుంచి ప్రారంభమయ్యాయి. బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సుల్లో చేరేందుకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ఉన్నత విద్యామండలి షెడ్యూల్ ప్రకటించడంతో విద్యార్థులు వారి తల్లిదండ్రులతో కాలేజీలకు క్యూ కట్టారు. కాలేజీల్లో అందుబాటులో ఉన్న కోర్సులపై ఆరా తీసి, అనంతరం మీ సేవా కేంద్రాలు, నెట్ సెంటర్లకు వెళ్లి ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. ఉన్నత విద్యా మండలి ఇచ్చిన షెడ్యూల్ మేరకు ఈ నెల 25 వరకు దరఖాస్తు చేసుకునేందుకు గడువు ఉంది. ఆ తర్వాత వెబ్ ఆప్షన్ ద్వారా విద్యార్థులు తమకు నచ్చిన కాలేజీలో చేరవచ్చు.

ఉమ్మడి జిల్లాలో 196 డిగ్రీ కాలేజీలు

ఆంధ్ర యూనివర్సిటీ అఫిలియేషన్‌తో ఉమ్మడి విశాఖ జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యాల పరిధిలో 196 డిగ్రీ కాలేజీలు ఉన్నాయి. వీటిలో ఏటా డిగ్రీ మొదటి సంవత్సరంలో 25 వేల మందికి పైగానే విద్యార్థులు చేరుతుంటారు. ఈ కాలేజీల నిర్వహణకు ఏటా ఆంధ్ర యూనివర్సిటీ అఫిలియేషన్ (గుర్తింపు) ఇస్తోంది. ఉన్నత విద్యామండలి ఆన్‌లైన్ ప్రవేశాల వెబ్‌సైట్‌లో వర్సిటీ అఫిలియేషన్ పొందిన కాలేజీల జాబితానే పెడతారు.

తనిఖీలు లేకుండానే కాలేజీలకు గ్రీన్ సిగ్నల్

విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే ఏటా డిగ్రీ కాలేజీల్లో తనిఖీలు జరిగేవి. కాలేజీల నిర్వహణకు అనువైన భవనాలు, తరగతి గదులు, అర్హత గల అధ్యాపకులు, ఆటస్థలం, లైబ్రరీ, సైన్స్ ప్రయోగశాలలు, పార్కింగ్ ప్రదేశం ఉండాలి. పోలీసు, జీవీఎంసీ, అగ్నిమాపక శాఖల నుంచి ధ్రువీకరణ పత్రాలు పొందాలి. ఇవన్నీ వర్సిటీ నుంచి వెళ్లే టీమ్ తనిఖీ చేసి నివేదిక ఇచ్చిన తర్వాతే అఫిలియేషన్ జారీ అవుతుంది. ఈ ప్రక్రియ మొత్తాన్ని వర్సిటీలోని కాలేజీ డెవలప్‌మెంట్ కమిటీ (సీడీసీ) పర్యవేక్షిస్తోంది. అయితే ఈ ఏడాది తనిఖీలు లేకుండానే ప్రవేశాలకు ఉన్నత విద్యా మండలి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చేసింది.

అనుమతుల్లేకున్నా దర్జాగా అడ్మిషన్లు

విశాఖ జిల్లాలోని మధురవాడలో అకాడమీ పేరుతో విద్యాలయాన్ని నిర్వహిస్తున్న ఓ సంస్థ వర్సిటీ గుర్తింపు లేకున్నా, బీబీఏ, బీసీఏ, ఇతర డిగ్రీ కోర్సుల్లో అడ్మిషన్లు చేపడుతున్నారు. ఏయూ పరిధిలోని ఉమ్మడి విశాఖ జిల్లాలో పలు ప్రైవేటు డిగ్రీ కాలేజీల్లో సరైన వసతులు లేవు. అర్హత గల ఫ్యాకల్టీ లేరు. ఇలాంటి కాలేజీల్లో చదువులు సవ్యంగా సాగుతాయా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

ప్రైవేటులో అడ్మిషన్ల దందా

ఇంటర్మీడియట్ ఫలితాలు ప్రకటించి ఇప్పటికే నాలుగు నెలలు అవుతుంది. ప్రైవేటు డిగ్రీ కాలేజీల యాజమాన్యాల వారు ఇప్పటికే ఇంటర్ పాసైన విద్యార్థులకు గాలం వేసి, వారికి సంబంధించిన అన్ని సర్టిఫికెట్లు సేకరించి, తమ కాలేజీలోనే చేరేలా ఏర్పాట్లు చేసుకున్నారు. దీంతో ప్రభుత్వ కాలేజీల్లో అడ్మిషన్లు గణనీయంగా తగ్గిపోయే ప్రమాదం ఉంది. ఇదిలా ఉంటే కాలేజీల నిర్వహణను ఉన్నత విద్యామండలి పర్యవేక్షిస్తుండగా ఆంధ్ర యూనివర్సిటీ ద్వారా వాటికి అఫిలియేషన్ ఇవ్వడంతోపాటు, పరీక్షలు నిర్వహిస్తున్నారు. వీరి మధ్య సమన్వయ లోపంతో ప్రైవేటు కాలేజీలపై పర్యవేక్షణ పూర్తిగా గాలికొదిలేశారు. దీంతో కూటమి ప్రభుత్వంలో ప్రైవేటు డిగ్రీ కాలేజీల్లో అడ్మిషన్ల దందా కొనసాగుతుందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

క్లుప్తంగా

మిత్రుడి కుటుంబానికి పూర్వ విద్యార్థుల చేయూత



మృతుడి సోదరుడు రాజేష్‌కు సాయం అందిస్తున్న కె.ఎం.నాయుడు

అనకాపల్లి: స్థానిక జీవీఎంసీ గవరపాలెం చిన్న హైస్కూల్ 1994–95 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు తమ ఉదారతను చాటుకున్నారు. ఆ బ్యాచ్ విద్యార్థి కటోజు కిరణ్‌కుమార్ ఇటీవల అనారోగ్యం కారణంగా మృతిచెందాడు. ఈ విషయం తెలుసుకున్న పూర్వ విద్యార్థులు రూ.1.22 లక్షలు సేకరించారు. ఈ మొత్తాన్ని మృతుడు సోదరుడు రాజేష్‌కు రింగ్‌రోడ్డు లక్ష్మీ నారాయణనగర్‌లో పూర్వ విద్యార్థుల సంఘం ప్రతినిధి కె.ఎం.నాయుడు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మృతుడికి ఇద్దరు కుమార్తెలు ఉండడంతో ఆర్థిక సహాయం అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు విల్లూరి హరికృష్ణ, విల్లూరి రాముడు, కొణతాల సంతోష్, నీలకంఠ, కాండ్రేగుల శశి, మద్దాల చిరంజీవి, వేగి జగన్, భాను, రమణ, అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

30న 'సంచార జాతుల విముక్తి దినోత్సవం'



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపూడి పరమేశ్వరరావు

అనకాపల్లి టౌన్: బీజేపీ ఆధ్వర్యంలో సంచార-అర్థ సంచార విముక్త జాతుల విముక్తి దినోత్సవాన్ని నిర్వహించనున్నట్టు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ద్వారపూడి పరమేశ్వరరావు తెలిపారు. స్థానిక పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 30న విజయవాడ దివెన్యూ ఫంక్షన్ హాల్‌లో జరిగే కార్యక్రమానికి జిల్లాలో ఉన్న సంచార జాతుల వారందరూ హాజరు కావాలన్నారు. ఈ సమావేశంలో ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి కర్రి రామకృష్ణ, కె.సన్యాసినాయుడు, రాజు, తదితరులు పాల్గొన్నారు.

ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

పాయకరావుపేట: పట్టణంలోని ప్రభుత్వ ఐటీఐలో 2025–26 సంవత్సరంలో అడ్మిషన్ల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కె.సత్యనారాయణ తెలిపారు. అభ్యర్థులు అన్ని ధ్రువపత్రాలతో ప్రభుత్వ ఐటీఐకు వచ్చి రిజిస్ట్రేషన్, సర్టిఫికెట్ వెరిఫికేషన్ పూర్తి చేసుకోవాలన్నారు. రిజిస్ట్రేషన్‌కు గడువు ఈ నెల 26వ తేదీ కాగా.. సర్టిఫికెట్ వెరిఫికేషన్ గడువు ఈనెల 27వ తేదీ అని పేర్కొన్నారు. అభ్యర్థులు ఎస్ఎస్‌సీ, కుల, ఆదాయ ధ్రువ పత్రాలతో పాటు పాస్ ఫొటో, ఈమెయిల్ ఐడీ, ఆధార్ లింక్ ఫోన్ నెంబరు, ఆధార్ కార్డ్‌తో ప్రభుత్వ ఐటీఐలో సంప్రదించాలన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు బుధవారం 13 దిమ్మలు వచ్చాయి

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	---	---
రెండో రకం	---	---
మూడోరకం	3,250	3,350

అనకాపల్లి సినిమాలు

రాజా	: వార్ 2
సత్యనారాయణ స్క్రీన్-1	: వార్ 2
సత్యనారాయణ స్క్రీన్-2	: కింగ్ డమ్
పర్తిసాయి	: మహావతార్ నరసింహం
షిర్డిసాయి	: కూలీ
వెంకటేశ్వర	: హరిహర వీరమల్లు
శ్రీ సత్య	: సోమేశ్వర సులోచన
రామచంద్ర	: వార్ 2

రక్త నిల్వలు

అనకాపల్లి: ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 19 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-5, బీ పాజిటివ్-5, ఓ పాజిటివ్-5, ఏబీ పాజిటివ్-4 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంక్ టెక్నీషియన్ యూ.లోకేష్(9703613706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా బుధవారం 386 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 329 మందికి సిలెండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధిని 08924-223595 ఫోన్ నంబర్‌లో సంప్రదించవచ్చు.

ముమ్మరంగా వరినాట్లు



కశింకోటలో వరి నాట్లు వేస్తున్న మహిళలు

- ఇటీవల కురిసిన వర్షాలతో రైతుల బిజీ
- ఇప్పటికే 422 ఎకరాల్లో నాట్లు పూర్తి
- సాధారణ విస్తీర్ణం 2,569 ఎకరాలు

కశింకోట: ఇటీవల కురిసిన వర్షాలకు మండలంలో వడివడిగా ఖరీఫ్ వరి నాట్లు పడుతున్నాయి. ఎదిగిన వరినారు ఉన్నచోట్ల నాట్లు వేస్తున్నారు. నారు ఎదుగుదల లేని చోట భూములకు ఊబాలు వేసి సిద్ధం చేస్తున్నారు. మండలంలో ఇప్పటికే 422 ఎకరాల్లో నాట్లు వేశారు. 20 శాతంలోపు బుధవారానికి నాట్లు జరిగాయి. ముున్ముందు మళ్లీ వర్షాలు పడితే సాధారణ విస్తీర్ణాన్ని మించి నాట్లు పడగలవని అధికారులు భావిస్తున్నారు. మండలంలో అత్యధికంగా పండించే ఖరీఫ్ వరి సాధారణ విస్తీర్ణం 2,589 ఎకరాలు. ప్రధానంగా శారదానది పరివాహక ప్రాంతాలు, రంగబోలు గెడ్డ జలాశయం, సాగునీటి చెరువులు ఆధారంగా పండిస్తారు. మరికొందరు బోర్లు ఆధారంగా సాగు చేస్తుంటారు. కశింకోట, వెదురుపర్తి, బయ్యవరం, తేగాడ, కొత్తపల్లి, బుచ్చియ్యపేట, ఏఎస్ పేట, ఏనుగుతుని, పల్లపు సోమవరం, నూతలగుంటపాలెం, జెట్టపురెడ్డితుని, నరసింగబిల్లి, చింతలపాలెం, గొబ్బూరు, అచ్యుతాపురం, విసన్నపేట, జమాదులపాలెం, పరవాడపాలెం, ఉగ్గినపాలెం, తాళ్లపాలెం, గైతులపాలెం, అచ్చెర్ల, జి.భీమవరం, సింగవరం, సుందరయ్యపేట, చెరకాం, తీడ, అడ్డాం మోసయ్యపేట, కన్నూరుపాలెం, తదితర గ్రామాల్లో వరి సాగుకు వరుణుడే దిక్కు.

సాగునీటి వనరులకు జలకళ

వర్షం పడితేనే శారదా నదిలో నీరు ఎక్కువగా ప్రవహించడం, సాగునీటి చెరువులు, జలాశయాలు నిండుతాయి. వాటి నుంచి సాగునీటి కాలువల ద్వారా పంట భూములకు నీరు చేరుతుంది. సాధారణంగా జులై నెలాఖరులో నాట్లు వేస్తారు. అయితే ఈ ఏడాది వర్షాలు లేకపోవడంతో ఆగస్టు నెలలో నాట్లు వేయడం ప్రారంభించారు. అది కూడా బోర్లు, నీటి సదుపాయం ఉన్నచోట వేశారు. సుమారు 25 ఎకరాల్లో ఒక శాతం మేర మాత్రమే నాట్లు పడ్డాయి. వారం రోజుల క్రితం వరకు సరైన వర్షాలు లేక కాస్తో కూస్తో నీటి సదుపాయం ఉన్న మేరకు అడపాదడపా నాట్లు వేశారు. మిగిలిన రైతులు వర్షం కోసం ఎదురు చూస్తున్న తరుణంలో ఇటీవల వర్షాలు ఒక్కసారిగా భారీగా కురిసి ఆదుకున్నాయి. రెండు రోజుల్లో 97 మిల్లీమీటర్ల మేర వర్షపాతం నమోదైంది. దీంతో పంట భూముల్లో నిండుగా నీరు చేరింది. ఎగువ ప్రాంతాల్లో కురిసిన శారదానదిలోకి ఒక్కసారిగా భారీగా వరద నీరు చేరింది. నదిపై ఉన్న గ్రోయిన్ల నుంచి సాగునీటి కాలువల ద్వారా పంట భూములకు నీరు అందింది. పలుచోట్ల చెరువులకు కూడా జలకళ వచ్చింది. దీంతో ముమ్మరంగా వరి నాట్లు వేస్తున్నారు. నూతలగుంటపాలెం, ఏనుగుతుని, చింతలపాలెం, నరసింగబిల్లి, తదితర గ్రామాల్లో వరి నాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. కశింకోట, వెదురుపర్తి ప్రాంతాల్లో వరి నారు ఇంకా ఎదుగుదల లేకపోవడంతో అక్కడక్కడా నాట్లు వేస్తున్నారు. మిగిలిన వారు భూములను దమ్ము దున్ని నాట్లు వేయడానికి సిద్ధం చేస్తున్నారు.



వరి నాట్లు వేయడానికి పొలంలో ట్రాక్టర్‌తో దమ్ము పడుతున్న దృశ్యం



కశింకోటలో ఇంకా ఎదగని వరి నారు

మళ్లీ వర్షాలు పడితే సాధారణ విస్తీర్ణాన్ని మించి సాగు

మండలంలో ఇటీవల కురిసిన వర్షాలతో సాగునీటి వనరులకు జలకళ వచ్చింది. దీంతో ముమ్మరంగా వరి నాట్లు జరుగుతున్నాయి. ఇప్పటికి 422 ఎకరాల్లో నాట్లు వేశారు. మండలంలో ఈ ఏడాది 2,589 ఎకరాలు వరి సాధారణ విస్తీర్ణంగా నిర్ణయించాం. ముున్ముందు వర్షాలు పడితే సీజన్ ముగిసే సరికి సాధారణ విస్తీర్ణాన్ని మించి సాగు పూర్తవుతుందని ఆశిస్తున్నాం.

– ఎం.స్వప్న, మండల వ్యవసాయ అధికారి, కశింకోట

వరి పొలాల్లో నిల్వ నీటిని తొలగించాలి



తుమ్మపాలలో అవగాహన కల్పిస్తున్న జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మోహన్‌రావు

అనకాపల్లి: వరి నాట్లు వేసిన పొలాల్లో ఇటీవల వర్షాలకు నిలిచిపోయిన నీటిని రైతులు తీసివేయాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బి.మోహన్‌రావు సూచించారు. మండలంలో తుమ్మపాల గ్రామంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీరు తీసిన పొలాల్లో గ్రోమోర్ 28:28:0 లేదా 20:20:13 ఎరువును ఎకరాకు 30 నుంచి 40 కేజీలు వేసుకున్నట్లయితే వరిచేలు ఎదుగుదల బాగుంటుందన్నారు. రైతులు విధిగా డీఏపీ 50 కేజీలు వేసుకోవాలన్నారు. నారుమడులలో జింకులోపం నివారణకు జింక్ సల్ఫేట్ 5 శాతం ద్రావణాన్ని పిచికారీ చేయాలన్నారు. మండల వ్యవసాయశాఖ అధికారి రంగాచారి మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ ఇంకా పడని రైతులు గ్రీవెన్స్‌లో వ్యవసాయ సహాయకురాలిని కలిసి అప్‌లోడ్ చేయించుకోవాలని కోరారు. రెండు, మూడు రోజుల్లో తుమ్మపాల రైతు సేవ కేంద్రానికి యూరియా వస్తుందని చెప్పారు.

యూరియా కోసం ఆరాటం



కశింకోటలోని రైతు సేవా కేంద్రంలో యూరియా ఎరువు కొనుగోలు కోసం రైతుల బారులు



గిడ్డంగి నుంచి రైతులు తీసుకెళుతున్న యూరియా బస్తాలు

కశింకోట: కశింకోటలోని రైతు సేవా కేంద్రంలో యూరియా కోసం రైతులు బారులు తీరారు. ఇటీవల వర్షాలు కురవడం, వరినాట్లు ముమ్మరం చేసిన నేపథ్యంలో యూరియా కోసం రైతులు ఎగబడ్డారు. ఎరువు అందుతుందా? లేదా? అని పోటీ పడ్డారు. సుమారు 12 టన్నుల యూరియా ఎరువు ఒక్క రోజులోనే పంపిణీ అయింది. అయితే గంటల తరబడి రైతులు బారులు తీరి ఆధార్ కార్డుపై యూరియా బస్తాలు కొనుగోలు చేశారు. బస్తా రూ.270కి సరఫరా చేశారు. తాళ్లపాలెం, కొత్తపల్లి రైతు సేవా కేంద్రాల్లో కూడా చెరో 12 టన్నుల వంతున యూరియాను ఆయా ప్రాంత రైతుల కోసం సరఫరా చేశారు. మండలంలో 36 టన్నుల యూరియా అందుబాటులో ఉంచామని మండల వ్యవసాయ అధికారి ఎం.స్వప్న ఈ సందర్భంగా తెలిపారు. కశింకోట, తాళ్లపాలెంలలో ప్రైవేటు డీలర్ల వద్ద కూడా యూరియా అందుబాటులో ఉందన్నారు. మళ్లీ మరో దఫా కూడా యూరియా సరఫరాకు చర్యలు చేపడతామన్నారు. ప్రస్తుతం వరి సాగు కోసం యూరియాను సరఫరా చేస్తున్నామన్నారు. పశుగ్రాసం సాగుకు ప్రస్తుతం యూరియా అందివ్వడం లేదన్నారు. నత్రజని, పొటాష్, భాస్వరం కలిసిన 19-19-19 రకం ఎరువును కూడా పొలాల్లో వెద జల్లితే ఎదుగుదలకు బాగుంటుందని రైతులకు ఆమె సూచించారు.

ఎల్ఐసీ ఏజెంట్ల నిరసన



ఎల్ఐసీ కార్యాలయం ఆవరణలో ధర్నా చేస్తున్న ఏజెంట్లు

అనకాపల్లి టౌన్: స్థానిక జీవిత బీమా కార్యాలయం ఎదుట ఏజెంట్లు బుధవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఏజెంట్స్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా(ఏవోఐ) యూనియన్ బ్రాంచి అధ్యక్షుడు పెంటకోట సైదు నాయుడు ఆధ్వర్యంలో బ్రాంచి మేనేజర్ హరగోపాల్‌కి పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రూప్ ఇన్సూరెన్స్ వయో పరిమితి 69 సంవత్సరాల నుంచి 85 సంవత్సరాలకు పెంచాలన్నారు. జీటీఐ ఇన్సూరెన్స్ మొత్తం రూ.15 లక్షల నుంచి రూ.25 లక్షలకు పెంచాలని, ప్రతి బీమా ఏజెంట్లకు సంక్షేమ నిధి, హామీ పెన్షన్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో స్టేట్ కమిటీ మెంబర్స్ గొర్లి శంకర్రావు, కార్యదర్శి కరణం మాణిక్యాలరావు, నడిశెట్టి అప్పారావు, ఉప్పునూరి అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత అవసరం



మాకవరం గ్రామంలో ప్రతిజ్ఞ చేస్తున్న పీహెచ్‌సీ సిబ్బంది

అనకాపల్లి టౌన్: ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తుమ్మపాల వైద్యాధికారి డి.ఆర్.ఎస్.వాణి జగదీశ్వరీ కోరారు. మండలంలోని పెద మాకవరంలో ప్రపంచ దోమల నివారణ దినోత్సవం సందర్భంగా పీహెచ్‌సీ సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. మన ఊరు–మన ఆరోగ్యం అంటూ ప్రతిజ్ఞ చేసి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దోమలు నీరు నిల్వ ఉన్న చోట వృద్ధి చెందుతాయన్నారు. నీటి నిల్వలను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఈవో బి.మంగమ్మ, మరియమ్మ పాల్గొన్నారు.

మట్టి గణపతి ప్రతిమలను పూజించాలి



విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు

అనకాపల్లి: మట్టి గణపతులను పూజించి పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీ రామరాజు కోరారు. స్థానిక జీవీఎంసీ గాంధీనగరం హైస్కూల్ విద్యార్థులకు సామూహిక వినాయక నిమజ్జన కమిటీ ఆధ్వర్యంలో బుధవారం మట్టి గణపతులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారు చేసిన గణపతులను పూజించడం వల్ల పర్యావరణానికి హాని జరిగే అవకాశాలు ఉన్నాయన్నారు. భావితరాల ప్రజలను దృష్టిలో పెట్టుకుని మట్టి గణపతులను మాత్రమే పూజించాలని ఆయన కోరారు. అనంతరం మట్టి గణపతులను పూజిస్తామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో కమిటీ వ్యవస్థాపకుడు ఆడారి కుమార్‌స్వామి, హైస్కూల్ హెచ్ఎం డి.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల పట్ల ప్రభుత్వం చిన్నచూపు



సమావేశంలో మాట్లాడుతున్న జి.కోటేశ్వరరావు

అనకాపల్లి: గ్రామాల్లో పారిశుధ్య కార్మికుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవడంలో విఫలమైందని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి జి.కోటేశ్వరరావు ఆరోపించారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో ఏపీ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా మహాసభ ఆ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ ఆధ్వర్యంలో బుధవారం జరిగింది. ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతుఊ పారిశుధ్య కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వడంలేదని, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలు అమలు చేయడం లేదన్నారు. కార్మికులకు మేలు చేసే 551, 680, 132, తదితర ప్రభుత్వ జీవోలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. ఇచ్చే అరకొర జీతాలు కూడా మూడు, నాలుగు నెలలకు ఒక్కొక్కసారి, ఐదు, ఆరు నెలలకి ఒకసారి ఇస్తున్నారని ధ్వజమెత్తారు. మద్యపానాన్ని నిషేధించి నిత్యావసర ధరలు తగ్గించాలని ఆయన కోరారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, కక్ష సాధింపు చర్యలు మానుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా కార్యవర్గ యూనియన్ గౌరవాధ్యక్షుడిగా ఆర్.శంకరరావు , జిల్లా అధ్యక్షుడిగా మొలకలపల్లి అప్పలరాజు, ప్రధాన కార్యదర్శిగా ఆడారి నాగేశ్వరరావు, కోశాధికారిగా నక్క రవికుమార్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా దాకారపు శ్రీనివాసరావు, 23 మంది కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు నాయిని బాబు, సోము నాయుడు, ఎస్. బ్రహ్మాజీ, దాకారపు శ్రీనివాసరావు, పరమేశ్వరరావు. చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

వ్యాయామం తప్పనిసరిగా చేయాలి

అనకాపల్లి టౌన్: ప్రతి ఒక్కరూ తప్పని సరిగా గుండె వ్యాధి పరీక్షలు చేయించుకోవాలని కార్డియాలజిస్ట్ డి.వాసుబాబు కోరారు. మండలంలోని కొత్తూరు పంచాయతీ బీఆర్‌టీ కాలనీలో బుధవారం ఉచిత గుండె జబ్బుల వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో జంక్ ఫుడ్‌కు దూరంగా ఉండాలన్నారు. వయసుతో సంబంధం లేకుండా తప్పనిసరిగా వ్యాయామం చేయాలన్నారు.

23న మెగా జాబ్‌మేళా

మునగపాక: ఈ నెల 23న మండలంలోని తిమ్మరాజుపేట డావెన్సీ అంతర్జాతీయ పాఠశాలలో మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్టు ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ తెలిపారు. ఈ మేరకు పోస్టర్‌ను బుధవారం ఆయన ఆవిష్కరించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ అవకాశాన్ని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి గోవిందరావు మాట్లాడుతూ పది, ఇంటర్, ఐటీఐ, డిప్లమో, డిగ్రీ, పీజీ వరకు చదువుకున్న యువతీ, యువకులు ఉదయం 9 గంటలకు హాజరుకావాలన్నారు. మరిన్ని వివరాలకు 9492429425 ఫోన్ నంబరులో సంప్రదించాలన్నారు.

ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

పాయకరావుపేట: పట్టణంలోని ప్రభుత్వ ఐటీఐలో 2025–26 సంవత్సరంలో అడ్మిషన్ల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కె.సత్యనారాయణ తెలిపారు. అభ్యర్థులు అన్ని ధ్రువపత్రాలతో ప్రభుత్వ ఐటీఐకు వచ్చి రిజిస్ట్రేషన్, సర్టిఫికెట్ వెరిఫికేషన్ పూర్తి చేసుకోవాలన్నారు. రిజిస్ట్రేషన్‌కు గడువు ఈ నెల 26వ తేదీ కాగా.. సర్టిఫికెట్ వెరిఫికేషన్ గడువు ఈనెల 27వ తేదీ అని పేర్కొన్నారు. అభ్యర్థులు ఎస్ఎస్‌సీ, కుల, ఆదాయ ధ్రువ పత్రాలతో పాటు పాస్ ఫొటో, ఈమెయిల్ ఐడీ, ఆధార్ లింక్ ఫోన్ నెంబరు, ఆధార్ కార్డ్‌తో ప్రభుత్వ ఐటీఐలో సంప్రదించాలన్నారు.

'దివ్యాంగుల పెన్షన్ల తొలగింపు దారుణం'



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ పట్టణ నాయకులు

అనకాపల్లి టౌన్: కుంటి సాకులతో దివ్యాంగుల పెన్షన్లను కూటమి ప్రభుత్వం తొలగించడం అన్యాయమని సీపీఐ పట్టణ నాయకులు వై.ఎన్.భద్రం, తాకాశి వెంకటేశ్వరావు అనారు. స్థానిక పార్టీ కార్యాలయంలో బుధవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. పుట్టుకతో పోలియో వ్యాధితో బాధపడుతూ కదలలేని దివ్యాంగులకు సైతం పెన్షన్ తొలగిస్తున్నారన్నారు. సూపర్ సిక్స్ అంటూ అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ప్రస్తుతం చేస్తున్న పెన్షన్ల తొలగింపు దారుణమన్నారు. రీవెరిఫికేషన్ పేరుతో దివ్యాంగుల జీవితాలతో ఆటలాడుకోవడం ఆటవిక చర్యని వారు విమర్శించారు. తక్షణమే తొలగించిన పింఛన్లను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కశింకోట: మండలంలోని బయ్యవరం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని ఏపీఈపీడీసీఎల్ కశింకోట డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.రామకృష్ణ తెలిపారు. కశింకోట, బయ్యవరం, విసన్నపేట, రామన్నపాలెం, తేగాడ, వెదురుపర్తి గ్రామాల్లో నిర్దేశిత సమయంలో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. ఈ విషయాన్ని విద్యుత్ వినియోగదారులు గుర్తించి తమ సిబ్బందికి సహకరించాలని కోరారు.

చెరకు పంటకు ఎర్ర కుళ్లు తెగులు



తాళ్లపాలెంలో చెరకుపై ఎర్ర కుళ్లు తెగులును పరిశీలిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తల బృందం

కశింకోట: మండలంలోని తాళ్లపాలెంలో చెరకు పంటకు ఎర్ర కుళ్లు తెగులు సోకినట్టు వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారుల బృందం గుర్తించింది. శాస్త్రవేత్తలు కె.వి.రమణమూర్తి, ఎన్.రాజకుమార్, పి.వి.పద్మావతి, వ్యవసాయ శాఖకు చెందిన ఏడీఏ సిహెచ్.సుబ్రహ్మణ్యం, మండల వ్యవసాయ అధికారి ఎం.స్వప్న బృందం గొబ్బూరు, చింతలపాలెం, తాళ్లపాలెం, ఉగ్గినపాలెం గ్రామాల్లో వరి, చెరకు పంటలను బుధవారం పరిశీలించింది. ఈ సందర్భంగా ఎర్రకుళ్లు తెగులు సోకిన చెరకు తోటలో నీరు నిల్వ ఉండకుండా తొలగించాలని శాస్త్రవేత్తలు సూచించారు. తెగుళ్లను తట్టుకునే 2009ఎ 107, 2009ఎ 252, 2006ఎ 223, 2012ఎ 369 రకాల చెరకును నాటుకోవాలని చెప్పారు. ఇక వరి ఆకుమళ్లపై పొడ తెగులు ఆశించినట్లు గుర్తించారు. దాని నివారణకు ప్రోపికెనాజోల్ మందును నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. వరి ఆకుతీతకు పది రోజుల ముందు కార్బోఫ్యూరాన్ 3జి గుళికలను 5 సెంట్ల ఆకుమడికి 800 గ్రాములు వేసుకోవాలని సూచించారు. వరి ఉడుపులకు దమ్ము చేస్తున్న భూములను పరిశీలించి రైతులకు పలు సూచనలిచ్చారు. గొబ్బూరు గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించి రైతులకు అవగాహన కల్పించారు.

దోమల నివారణపై అవగాహన ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న తాళ్లపాలెం పీహెచ్‌సీ సిబ్బంది

కశింకోట: మండలంలోని తాళ్లపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రపంచ దోమల దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి ఎ.మనీషా ఆధ్వర్యంలో డెంగ్యూ, మలేరియా, ఫైలేరియా, చికెన్ గున్యా వంటి వ్యాధులకు దోమలు కారణమని పేర్కొంటూ ర్యాలీ, అవగాహన సదస్సు నిర్వహించి, ప్రజలకు అవగాహన కల్పించారు. దోమల వల్ల వ్యాధులు ప్రబలకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు వివరించారు. ఆరోగ్య విస్తరణాధికారి వి.ఎ.సుబ్బారావు, ఆరోగ్య బోధకుడు ఎంఎస్‌వీ ప్రసాద్, హెల్త్ అసిస్టెంట్ పి.శివరామకృష్ణ, ఆరోగ్య సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ముగిసిన లలితా సహస్ర నామ పారాయణ



నక్షత్ర హారతిని దర్శించుకుంటున్న భక్తులు



శారదానదిలో కలశాన్ని నిమజ్జనం చేస్తున్న భక్తులు

కశింకోట: స్థానిక గవరపేటలో ఉన్న శారదా గణపతి రామాలయంలో 41 రోజుల పాటు మండల దీక్ష నిర్వహించిన లలితా సహస్ర నామ పారాయణ కార్యక్రమం బుధవారం వైభవంగా ముగిసింది. ఈ సందర్భంగా మహిళలు సామూహికంగా లలితా సహస్ర నామ పారాయణ చేశారు. అమ్మవారికి అర్చకుడు శ్రీనివాస్ ప్రత్యేక కుంకుమార్చనలు నిర్వహించారు. 108 ఒత్తులతో నక్షత్ర హారతి ఇచ్చారు. సహస్ర నామ పారాయణ సందర్భంగా నెలకొల్పిన కలశాన్ని సంప్రదాయంగా వీధుల్లో భజన చేస్తూ ఊరేగించి స్థానిక శారదా నదిలో నిమజ్జనం చేశారు. ఆలయ కమిటీ గౌరవాధ్యక్షుడు భీశెట్టి దుర్గా నాగేశ్వరరావు ఆధ్వర్యంలో మధ్యాహ్నం అన్నసమారాధన నిర్వహించారు. కమిటీ ప్రతినిధులు కొణతాల లింగాజీ, ఎస్‌వీఎస్ సత్యనారాయణ, భీమరశెట్టి వేణుగోపాలరావు తదితరులు, మహిళా భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

నేడు కేబుల్ ఆపరేటర్ల సమావేశం

అనకాపల్లి: అనకాపల్లి డివిజన్ బీఎస్ఎన్ఎల్ పరిధిలో కేబుల్ ఆపరేటర్లకు స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ రహదారి వివేకానంద చారిటబుల్ ట్రస్ట్ ఆవరణలో గురువారం మధ్యాహ్నం 3 గంటలకు సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్టు యలమంచిలి బీఎస్ఎన్ఎల్ జేఈ దుర్గాప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అనకాపల్లి, పరవాడ, అచ్యుతాపురం, చోడవరం, యలమంచిలి కేబుల్ ఆపరేటర్లు హాజరు కావాలని ఆయన కోరారు.

అన్న సమారాధనకు విరాళం



అన్నసమారాధనకు సహాయం అందిస్తున్న ముత్యాల రాజేష్

అనకాపల్లి టౌన్: దైవ కార్యక్రమాలలో ప్రతి ఒక్కరూ విధిగా పాలుపంచుకోవాలని ముత్యాల గార్మెంట్స్ అధినేత ముత్యాల రాజేష్ కోరారు. పట్టణంలోని నరసింగరావు పేటలోని తన కార్యాలయంలో దుర్గాలాడ్జి వీధి శ్రీకృష్ణ కమిటీ సభ్యులకు రూ.50 వేలు సహాయం అందించారు. శ్రీకృష్ణాష్టమి వేడుకలో భాగంగా నిర్వహించే అన్నసమారాధనకు ఈ సహాయం చేసినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీకృష్ణ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.